క్లుప్తంగా

కొలువుదీరిన పీరీలు



సవారీబంగ్లాలో కొలువుదీరిన పీరీలు

తాంసి: మొహర్రం పండుగను పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న సవారీ బంగ్లాలలో పీరీలు కొలువుదీరాయి. తాంసి మండల కేంద్రంతో పాటు మండలంలోని కప్పర్ల, పాలోది, సావర్గాం, తాంసి, పొన్నారి, హస్నాపూర్, బండల్‌నాగాపూర్ గ్రామాల్లో ఇప్పటికే బంగ్లా నిర్వాహకులు మొహర్రం సందర్భంగా సవారీబంగ్లాలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. మండల కేంద్రంలో పెద్ద సవారీబంగ్లా నుంచి బుధవారం రాత్రి సవారి గొడుగు, ఆభరణాలు డప్పుచప్పులతో తీసుకెళ్లి వాగులో శుద్ధి చేశారు. అనంత రం సవారీ బంగ్లాలో పీరీలను ఏర్పాటు చేశారు.

ఆపదలో ఉన్నాడు.. ఆదుకోండి



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రవి

బోథ్: మండలంలోని ధన్నూర్(బి) గ్రామానికి చెందిన తొర్తి రవి చిన్న మెదడుకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నాడు. చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో చికిత్స చేయించుకునే పరిస్థితి లేకుండా పోయింది. రవి గతంలో అప్పు చేసి దుబాయ్ వెళ్లాడు. అప్పటి నుంచి అనారోగ్యానికి గురయ్యాడు. ఇటీవల స్వగ్రామమైన ధన్నూర్(బి) గ్రామానికి వచ్చాడు. అంతలోనే చిన్న మెదడుకు సంబంధించిన వ్యాధితో ఆరోగ్యం మరింత క్షీణించింది. ఈక్రమంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే చికిత్స చేయించుకునేందుకు రోజుకు రూ. 40,000 వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. బీద కుటుంబం కావడంతో అంత డబ్బు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న రవిని ఆదుకోవాలని కుటుంబసభ్యులు వేడుకుంటున్నారు. దాతలు 84640 33834కు ఫోన్ పే చేయాలని కోరుతున్నారు.

ఇస్లాంనగర్‌లో వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

ఇచ్చోడ: మండలంలోని ఇస్లాంనగర్‌లో గురువారం ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాగర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 54 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. శిబిరంలో పీహెచ్‌ఎస్ రాజుబాయి, హెల్త్ అసిస్టెంట్ రాథోడ్ కైలాస్, ఏఎన్‌ఎం అహల్య, ఆశవర్కర్ పాల్గొన్నారు.

సెర్ప్ సీఈవోను కలిసిన దివ్యాంగులు

కైలాస్‌నగర్: జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్‌ను గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని సెర్ప్ కార్యాలయంలో కలిసిన సంఘం నాయకులు తమ సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. దివ్యాంగులకిచ్చే పెన్షన్లను ప్రతినెలా మొదటి వారంలోనే అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బావునే నగేశ్, ప్రధాన కార్యదర్శి ఉగ్గి నానయ్య, దూపే శంకర్, సంతోష్ సిద్ది అప్సర్, బాబు ఖాన్, ప్రమోద్ కుమార్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



నిల్వ నీటిని పారబోస్తున్న వైద్య సిబ్బంది

తాంసి: వర్షాకాలం దృష్ట్యా వ్యాధులు రాకుండా ప్రతిఒకరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని భీంపూర్ హెచ్‌ఈవో జ్ఞానేశ్వర్ సూచించారు. గురువారం మండలంలోని రాజుల్‌కోరి గ్రామంలో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇంటింటా తిరుగుతూ వైద్య పరీక్షలు చేయడంతో పాటు నీటిని నిల్వ ఉండకుండా చూడాలన్నారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి సూర్యకాంత్, సాహితి, ఏఎన్‌ఎం విజయలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటి సంఘం ఎన్నికలెప్పుడో?

- 2006లో చివరిసారిగా ఎన్నికల నిర్వహణ
- పట్టించుకోని ప్రభుత్వం
- అధ్వానంగా మారుతున్న చెరువులు



శిథిలావస్థకు చేరిన తూము



కొత్తూరు చెరువు

తలమడుగు: పదహారేళ్లుగా నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం లేదు. దీంతో చెరువులు అధ్వానంగా మారాయి. మరోవైపు మిషన్ కాకతీయ పథకంలో భాగంగా గత ప్రభుత్వం చెరువులు, కుంటలకు, మరమ్మతులు చేసినా.. వాటిపై అజమాయిషీ లేక నీటి విడుదల, మరమ్మతులపై దృష్టి పెట్టేవారు కరువయ్యారు. చెరువుల అభివృద్ధి కోసం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మిషన్ కాకతీయ పథకాన్నికి శ్రీకారం చుట్టింది. ఒకప్పుడు చెరువుల అభివృద్ధి, నిర్వహణ, ఆయకట్టుకు నీటి సరఫరా చేయడం, తదితర పర్యవేక్షణ పనులు నీటి సంఘాలు, పాలకవర్గాలు చేపట్టేవి. పదహారేళ్లుగా ప్రభుత్వాలు నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించకపోవడంతో పర్యవేక్షణ కరువైంది. దీంతో కంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారు. కొన్ని గ్రామాల్లో పనులు చేపట్టకముందే నిధులు కాజేస్తున్నారు.

గతంలో ఇలా..

గతంలో ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఎన్నికలు నోటిఫికేషన్ విడుదల చేయగానే 100 ఎకరాల ఆయకట్టు ఉన్న ప్రధాన చెరువుల ఆయకట్టుకు రైతులు చైర్మన్‌తో పాటు డైరెక్టర్ ఎన్నుకునేవారు. పాలకవర్గ సభ్యులు చెరువుల నిర్వాహణతో పాటు నీటిని పంట పొలాలకు విడుదల చేసుకొని పొదుపుగా వాడుకునేలా చర్యలు తీసుకునేవారు. అంతేకాకుండా రైతులను సమన్వయ చేసుకుంటూ.. అభివృద్ధి పనులు నిర్వహించేవారు. 16 ఏళ్ల నుంచి నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించకపోవడంతో చెరువుల నిర్వహణ అధ్వానంగా మారింది. కొన్ని చెరువులు శిథిలావస్థకు చేరుకున్నాయి. తూములు పనిచేక సాగు నీరు రాక నిరుపయోగంగా మారాయి.

2008 నుంచి ఎన్నికలు బంద్

బోథ్ నియోజకవర్గంలో తొమ్మిది మండలాల్లో వందల ఎకరాలు ఆయకట్టు అంతకంటే ఎక్కువగా ఉన్న చెరువులు దాదాపు 45పైగానే ఉన్నాయి. తలమడుగు మండలంలో దాదాపు 10 చెరువులు ఉన్నాయి. అందులో కజ్జర్ల, కొత్తూరు, రూయ్యాడి, ఝరి, దేవాపూర్, బరంపూర్, పల్సి(కె), లింగి, ఉమ్రీ, లక్ష్మంపూర్ గ్రామాల్లో చెరువులున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 2006లో రాష్ట్రవ్యాప్తంగా వందల ఎకరాల ఆయకట్టు ఉన్న ప్రధాన చెరువులకు సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. వాటి పదవీకాలం 2008లో ముగిసింది. అప్పటినుంచి తిరిగి ఎన్నికలు నిర్వహించిన దాఖలు లేవు. ఇప్పటికైనా నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించి, చెరువులను మరింత అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు.

నీటి సంఘాలతోనే చెరువుల అభివృద్ధి



నీటి సంఘాలను ఎన్నుకుంటేనే చెరువులు అభివృద్ధి చెందుతాయి. గతంలో నీటి సంఘాలు ఉండడంతో నీటిని పొదుపుగా వాడుకోవడమే కాకుండా వాటి పర్యవేక్షణ కూడా పకడ్బందీగా ఉండేది. గత ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం పేరుతో చెరువులను అభివృద్ధి చేసింది. ప్రభుత్వం నీటి సంఘాలపై దృష్టి సారించాలి.

– కరుణాకర్‌రెడ్డి, రైతు

ఆదేశాలు ఇంకా రాలేదు

ఇది ప్రభుత్వ పరిధిలోని అంశం. ప్రభుత్వం నుంచి నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఆదేశాలు వస్తే తప్పకుండా నిర్వహిస్తాం. ప్రస్తుతం ఈ విషయంలో ప్రభుత్వ ఆదేశాలే అంతిమం.

– రాజ్‌మోహన్, తహసీల్దార్

మడిగెలను పరిశీలించిన ఎమ్మెల్యే

- వారం రోజులు గడువు కోరిన వ్యాపారులు
- ఆ తర్వాత కూల్చివేయాలని అధికారులకు ఆదేశం



వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణం శివాజీచౌక్‌లోని కూరగాయల మార్కెట్‌లో శిథిలావస్థకు చేరిన మున్సిపల్ మడిగెల సముదాయాన్ని ఎమ్మెల్యే పాయల్ శంకర్ గురువారం పరిశీలించారు. ఏళ్ల క్రితం నిర్మించిన 37 మడిగెల కాలం చెల్లినందున వాటిని కూల్చివేయాలంటూ గతంలోనే హైకోర్టు తీర్పునిచ్చింది. దానికనుగుణంగా దుకాణాలను ఖాళీ చేయాలంటూ మున్సిపల్ అధికారులు వ్యాపారులకు నోటీసులు జారీ చేశారు. కానీ వారు ఖాళీ చేయకుండా అందులోనే వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. వర్షాలు కురుస్తుండటం, శిథిలావస్థకు చేరిన భవనాలను తొలగించాలని జిల్లా కలెక్టర్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే మున్సిపల్ అధికారులతో కలిసి ఆ మడిగెలను పరిశీలించారు. అక్కడి వ్యాపారులతో మాట్లాడి స్వచ్ఛందగా ఖాళీ చేయాలని సూచించారు. అయితే వారం రోజులు గడువు కావాలని ఎమ్మెల్యేను కోరగా అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. గడువు అనంతరం వాటిని కూల్చివేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అనంతరం కమిషనర్ ఖమర్ అహ్మద్ అశోక్‌రోడ్‌లో శిథిలావస్థకు చేరిన ఏళ్లనాటి ఇంటిని పరిశీలించారు. దాన్ని ఖాళీ చేయమని ఇది వరకే యజమానికి నోటీసు ఇచ్చిన వారు స్పందించకపోవడంతో స్వయంగా ఆయనే వెళ్లి వారికి నచ్చజెప్పారు. మూడు రోజుల్లో ఇంటిని ఖాళీ చేయకుంటే మున్సిపల్ ద్వారానే భవనాన్ని కూల్చివేస్తామని కమిషనర్ పేర్కొన్నారు. వారి వెంట టౌన్ ప్లానింగ్ అధికారి అనురాధ, సిబ్బంది ఉన్నారు.

రాథోడ్ రమేశ్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

ఉట్నూర్‌రూరల్: ఎంపీ, ఎమ్మెల్యే, జెడ్పీచైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టి ఇటీవల అకాల మరణం పొందిన జననేత, బీజేపీ జాతీయ నాయకులు రాథోడ్ రమేశ్ తేర్వి కార్యక్రమం మండల కేంద్రంలోని పూలాజీ బాబా పాఠశాలలో నిర్వహించారు. రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొని రాథోడ్ రమేశ్ చిత్రపటానికి నివాళులర్పించారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీలు గోడం నగేశ్, వంశీ, ఎమ్మెల్యేలు వెడ్మ భొజ్జు, పాల్వాయి హరీశ్‌బాబు, పాయల్ శంకర్, అనిల్‌జాదవ్, వివేక్, మాజీ జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, కాంగ్రెస్ ఆసిఫాబాద్ ఇన్‌చార్జి శ్యాంనాయక్, ఖానాపూర్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ పాల్గొని నివాళులర్పించారు. రాథోడ్ రమేశ్ సేవలను కొనియాడారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు.

దివ్యాంగుల హక్కుల కోసం పోరాడుతా



ఎమ్మెల్యేకు వినతిప్రతం అందజేస్తున్న నాయకులు

నేరడిగొండ: దివ్యాంగుల హక్కుల కోసం పోరాడుతానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం బోథ్ నియోజకవర్గ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ.. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులకు, ఇతర ఆసరా పెన్షన్ల వారికి పెంచుతానని ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పెపెల్లి ప్రేమరాజ్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎదులాపురం: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో మాట్లాడారు. మున్సిపల్ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్మికులకు ప్రతినెలా 5వ తేదీలోపు వేతనాలు చెల్లించడంతో పాటు ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పారుగు సేవల సిబ్బందిని క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని రక్షణ కోసం ప్రత్యేక దుస్తులను అందించాలన్నారు. సమావేశంలో నాయకులు సిర్ర దేవేందర్, గాజంగుల రాజు, చిరంజీవి కాంతారావు పాల్గొన్నారు.

కురియన్ కమిటీ భేటీకి హాజరైన ఆత్రం సుగుణ

కైలాస్‌నగర్: తెలంగాణలో జరిగిన పార్లమెంటు ఎన్నికల ఫలితాలపై కురియన్ కమిటీ హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో గురువారం పోస్టుమార్టం నిర్వహించింది. ఎన్నికల్లో ఓటమికి గల కారణాలను తెలుసుకునేందుకు రాజ్యసభ మాజీ డిప్యూటీ చైర్మన్ కురియన్ నేతృత్వంలోని త్రిసభ్య కమిటీ పోటీ చేసిన అభ్యర్థులతో సమావేశమైంది. ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆత్రం సుగుణ కురియన్ కమిటీ సభ్యులతో భేటీ అయ్యారు. ఓటమికి గల కారణాలను ఆమె కమిటీ సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గెలుపు ఓటములతో సంబంధం లేకుండా కాంగ్రెస్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ మీటింగ్ ఏర్పాటు చేయడం మంచి పరిణామమన్నారు. జరిగిన లోపాలు సరిదిద్దుకోవడానికి మంచి అవకాశమన్నారు. తన ఓటమికి కొన్ని పొరపాట్లు జరిగాయని, వాటిని కురియన్ కమిటీకి వివరించినట్లు ఆమె తెలిపారు.

సభ విజయవంతం చేయండి

ఎదులాపురం: జిల్లాలో పదోన్నతులు పొందిన తెలుగు, హిందీ, ఉర్దూ, మరాఠీ, వ్యాయామ, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ జిల్లా కేంద్రంలోని మంగళమూర్తి బంకెట్ హాల్లో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు నిర్వహించే సభను విజయవంతం చేయాలని భాషా పండితులు, పీఈటీలు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలో మాట్లాడారు. పదోన్నతుల కోసం భాషా పండితులు, పీఈటీలు 25 ఏళ్ల పోరాటం చేయడం జరిగిందన్నారు. ఇక పదోన్నతులే రావని అనుకున్న తరుణంలో కోర్టు కేసులు, అడ్డంకులను లెక్కచేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పదోన్నతులు కల్పించిందన్నారు. సభకు ముఖ్య అతిథిగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఎంపీ నగేశ్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, అనిల్ జాదవ్, డీఈవో ప్రణీత హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాషా పండితులు చిందం ఆశన్న, గిరిధర్, శంకర్, రమేశ్, రామకృష్ణగౌడ్, విజయ్‌మోహన్, జావిద్, భాస్కర్ రెడ్డి, వినాయక్, పుష్పలత, అర్చన పాల్గొన్నారు.

బైక్ అడిగినందుకు దాడి

ఎదులాపురం: తన బైక్‌ను తాను అడిగినందుకు వ్యక్తిపై దాడి చేసిన ఘటన స్థానికంగా చోటు చేసుకుంది. వన్‌టౌన్ హెడ్ కానిస్టేబుల్ మథన్ వివరాల ప్రకారం.. బేల మండలం కొబ్బాయికి చెందిన సాగర్ అదే మండలం చప్రాలకు చెందిన గద్దేవార్ పోశెట్టి బైక్‌ను గురువారం అవసరం నిమిత్తం తీసుకెళ్లాడు. తిరిగి తీసుకురాకపోవడంతో పోశెట్టి బైక్ అడగటంతో ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. కాగా స్థానిక ముజ్జు హోటల్‌కి పిలిపించి బైక్ ఏదని అడగితే బైక్ ఇవ్వకుండా పోశెట్టిని బూతులు తిట్టడమే కాకుండా రాయితో కొట్టాడు. దీంతో బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

ఆటో చోరీ

ఎదులాపురం: పట్టణంలోని ఓ హోటల్ ఎదుట పార్కింగ్ చేసి ఆటో చోరీకి గురైన ఘటన స్థానికంగా చోటు చేసుకుంది. పట్టణ వన్‌టౌన్ హెడ్‌కానిస్టేబుల్ మథన్ వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ఫేరోజ్ గురువారం రాత్రి ఆదిలాబాద్ రిమ్స్‌కు తీసుకువచ్చారు. రాత్రి కావడంతో ఈద్గా ప్రాంతంలోని మదీనా హోటల్ ముందు ఆటోను ఉంచి హోటల్‌లో బస చేశారు. గురువారం తెల్లవారు చూసే సరికి ఆటో కనిపించలేదు.

ఒత్తిడిని జయిస్తేనే విజయం



అవగాహన కల్పిస్తున్న సైకాలజిస్ట్ శ్రీకాంత్

నేరడిగొండ: ఒత్తిడిని జయిస్తేనే విద్యార్థులు విజయం సాధించవచ్చని క్లినికల్ సైకాలజిస్ట్ శ్రీకాంత్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు రెండేళ్ల కాలంలో తమ లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకు సాగాలని సూచించారు. లక్ష్య సాధనలో అనేక ఒడిదుడుకులు వస్తాయని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు, ధూమపానానికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షాబాన తరన్నుమ్, లెక్చరర్లు, సోషల్ వర్కర్ చిరంజీవి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న సత్యనారాయణ రెడ్డి

బోథ్: ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని విద్యాశాఖ ఆర్జేడీ సత్యనారాయణ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని సోనాల గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలను సందర్శించారు. డిజిటల్ బోర్డు వినియోగించే విధానాన్ని పరిశీలించి, వినియోగ విధానాన్ని విద్యార్థులకు వివరించారు. పాఠశాలల్లో మైదానం ఉంటే కొంత భాగాన్ని కూరగాయలు పండించేందుకు ఉపయోగించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో సీసీ రాజేశ్వర్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు నర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి కృషి



నివాళులర్పిస్తున్న కోట్నాక్ తిరుపతి

ఇంద్రవెల్లి: తెలంగాణ రాష్ట్రంలోని గిరిజనులకు గిరిజన కార్పొరేషన్ ద్వారా అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు తనవంతుగా కృషి చేస్తానని తెలంగాణ గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక్ తిరుపతి అన్నారు. గురువారం మండలంలోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం మండలంలోని కేస్లాపూర్ నాగో బా ఆలయాన్ని సందర్శించి నాగోబాను దర్శించుకున్నారు. ఆదివాసీ గిరిజనులను అన్నివిధాలుగా ఆదుకోవడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. తెలంగాణ పభుత్వం తన సేవలను గుర్తించి తెలంగాణ గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్‌గా పదవీ ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా ప్ర ధాన కార్యదర్శి వెట్టి మనోజ్, జుగ్నాక్ భరత్, చహకటి నాగోరావ్, సోయం రాందాస్, గేడం భరత్, హ నుమంత్‌రావ్, జాలిమ్‌షావ్, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న శ్రీకాంత్

ఇచ్చోడ: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని యాంటీ డ్రగ్స్ కమిటీ బోర్డు అడ్వయిజర్ సభ్యులు శ్రీకాంత్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కౌమర దశలో వారి మానసిక స్థితి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఇంటర్ విద్యార్థుల్లో ఏకగ్రత చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గణేష్ కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా కన్వీనర్ శ్రీసత్యనారాయణ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

బోథ్: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జిల్లా పొగాకు నియంత్రణ విభాగం క్లినికల్ సైకాలజిస్ట్ శ్రీకాంత్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మత్తుపదార్థాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్తు పదార్థాలైన సిగరెట్, బీడీ, గుట్కా, డ్రగ్స్, మద్యానికి విద్యార్థులు దూరంగా ఉండాలని అన్నారు. జీవితం ఎంతో విలువైనదని పేర్కొన్నారు. క్రమశిక్షణతో జీవితాన్ని సాఫల్యం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ అధ్యాపకులు, సామాజిక కార్యకర్త చిరంజీవి, విద్యార్థులు పాల్గొన్నారు.

సన్మానం

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలోని బేల మండలం ఆదివాసీ పర్ధాన్ సమాజ్‌కు చెందిన మడావి బాపురావ్ గత నెలలో సిటీ ఆర్మ్ రిజర్వ్‌డ్ హెడ్ క్వాటర్ హైదరాబాద్ డిప్యూటీ కమిషన్ ఆఫ్ పోలీస్ అడ్మిన్ (డీసీపీ)గా పదవీ విరమణ పొందిన సందర్భంగా ఆయనను ఆదివాసీ పర్ధాన్ సమాజ్‌కు చెందిన పలువురు ఆదిలాబాద్‌లో ఆయన నివాసంలో గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువా, పూలమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఆదివాసీపర్ధాన్ కులస్తులు పాల్గొన్నారు.

నాణేల ప్రదర్శన



నాణేలు ప్రదర్శిస్తున్న రాజ్ కుమార్

బోథ్: సొనాల గ్రామంలోని ఉషోదయ పాఠశాలలో అంతర్జాతీయ మానవ హక్కుల ఆర్గనైజేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్ విద్యార్థులకు వివిధ రకాల నాణేలను ప్రదర్శించారు. బ్రిటీషు కాలం నాటి నాణేలు, మొఘల్ కాలంలో, స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు గల నాణేలను ప్రదర్శించి వివరించాడు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఇర్ల గంగాధర్, ఉపాధ్యాయురాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర డిగ్రీ కళాశాలలో 2024– 25 విద్యా సంవత్సరంలో వివిధ కోర్సులలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ ప్రసన్న ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ 10, బీకాం (సీఏ) 18, బీజెడ్‌సీ 6, ఎంపీసీఎస్ 14, డీఎస్ 16 చొప్పున సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఖాళీగా ఉన్న సీట్లకు ఎస్టీ విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లలతో ఈనెల 15 లోపు కళాశాలలో నేరుగా సంప్రదించాలన్నారు.

కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన సభ్యులు

ఇచ్చోడ: బోథ్ నియోజకవర్గ పాస్టర్ల కార్యవర్గాన్ని గురువారం మండల కేంద్రంలోని మోరియా చర్చిలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సదానందం, అధ్యక్షుడిగా నేహెమియ్య, ఉపాధ్యక్షుడిగా నరేశ్, ప్రధాన కార్యదర్శిగా మాణిక్యం, ఉప కార్యదర్శిగా రమణ తిమోతి, కోశాధికారిగా పాల్‌రాజ్ కుమార్, సలహాదారులుగా పీటర్ నాయక్, జెకర్యా, ఉదయ్‌కుమార్, అశోక్ ఫిలిప్, రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఇంటింటికీ మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న ఈవో అంజయ్య

బోథ్: బోథ్ మండల కేంద్రంలో గ్రామపంచాయతీ ఈవో అంజయ్య, సిబ్బందితో కలిసి గురువారం ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు. ప్రతిఇంటికీ ఆరు మొక్కలను అందిస్తున్న ట్లు తెలిపారు. ప్రజలు తమ బాధ్యతగా మొక్కలను నాటి సంరక్షించాల ని కోరారు. మొక్కలను పెంచి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.